# పార్వతీశం ప్రేమ గోల

—ఎస్. హరిప్రియ



"గిరీశం! డాక్టరు దగ్గరికెళ్లాలి. తోడు వస్తావా?" తన డియరెస్ట్ ఫ్రెండ్‌ని రిక్వెస్టింగ్‌గా అడిగాడు పార్వతీశం.... గిరీశం లాయరుగా ప్రాక్టీస్ చేస్తున్నాడు.

"ఏం(టా.... ఏమైంది? అంతా బాగానే వుంది కదా?" ఆదుర్దాగా ఆలిండియా రేడియో పద్ధతిలో అడిగాడు.

"అంతా బాగానే వుంటే డాక్టరు దగ్గరికెందుకురా వెళ్లటం?.... మనసంతా వికారంగా, గుండెంతా బరువుగా.... తిండి సయించకుండా.... ధర్మా మీటర్ని బద్దలు కొట్టేంత సెగలు పొగల్తో నిద్రపట్టక...."

"ఆపావు. అర్థమైంది. నువ్వింకా ఆకుచాటు పిందెవి, నాన్న కొంగట్టుకు తిరిగే చంటి వెధవ్వను కున్నా. ఇంత వాడి వయ్యావన్నమాట..... ఊం...... నీకూ వచ్చేసిందన్న మాట!

"ఏమిటా వెధవ స్త్రీ లింగ సంబోధన? ఏం వచ్చింది నాకు?!"

"కంగారు పడకు. నీకు వచ్చేసింది యౌవ్వనం.... నీకు కావాలి...."

"రేడియో డైలాగులు, టీ.వీ. యాడ్ డైలాగులు చెప్పకురా. ఇవతల ఛస్తుంటే...." కోపంగా అన్నాడు పార్వతీశం.

"నీది లౌవ్‌ఫీవర్రా. పైత్యం ప్రకోపించి గుండె కెక్కి కూర్చుంది."

"ఏం? తమాషాగా వుందా?" కస్సుమన్నాడు.

"అదేం కాదు..... నిజం చెప్పు. ముక్కూ మొహం తెలీని ఆ డాక్టరెవడి దగ్గరో ఒప్పుకునే బదులు చిన్న నాటి నుండి ఒకే గదిలో పడుకుని ఒకే వస్త్రం కట్టుకున్న ప్రాణ మిత్రులం.... నా దగ్గర సిగ్గులేకుండా ఒప్పుకోవటం మంచిది కదూ? నిజం చెప్పరా." దగ్గరగా వచ్చి గుసగుసగా అన్నాడు గిరీశం.

"....ని....జ....మే....రా." సిగ్గు పడుతూనే అన్నాడు.

"ఓ......స్.... ఈ మాత్రానికే డాక్టరెందుకురా? నా సలహా పాటించు చాలు. బాగుపడి పోతావ్."

"ఫీజు కోసం వెర్రి బాగులోళ్లకిచ్చే సలహా నాకివ్వకు. లాయరు వైతే అయ్యావుగాని."

"ఐతే.... నీ ఖర్మ..... అనుభవించు." పైకి అనేసి తనలో తనే "నీకంటే వెర్రి వెధవ నాకెవడు దొరుకుతాడ్రా వెధవన్నర వెధవా..... అసలీ మధ్య కేసులేమీ దొరక్క గోళ్లు కొరుక్కుంటున్నాను. నీ లాంటి వెర్రి బాగుల వెధవ కోసమే ఎదురు చూస్తున్నాను." అనుకుంటూ పైకి మళ్లీ

"వెధవ సలహాలు నీకెందుకిస్తాన్రా పిచ్చి వెధవా...." అన్నాడు.

"ఐతే చెప్పు."

"ముందు నీ పేరు పార్వతీశం కాదు.... పార్వతీష్.... అర్థమైందా?

"ఊం...."

"ఏం చేసినా ప్లాన్డ్‌గా చెయ్యాలి..... ముందు మీ నాన్న దగ్గరికెళ్లి దీనంగా మొహం పెట్టి వెంటనే మ్యారేజ్ చెయ్యమని అడుగు."

"ఎందుకూ? చెప్పుతో కొట్టించుకోటానికా?"

"కొట్టడు. అమాంతం వాటేస్కుని ముద్దుల్తో ముంచేసి ఆలిండియా రేడియోలో అనౌన్స్ చేసి నంత పని చేస్తాడు. నా మాట విను..... నువ్వు మ్యారేజ్‌కి రెడీ అయ్యావంటే మీ నాన్నకి శతకోటి లాభాలు."

"అదేలా?"

"ఒకటి.... పుష్కలంగా కట్నం.... రెండు.... ఒక్కడే సుపుత్రుడివి కాబట్టి వియ్యాల వారిని దండుకు తినొచ్చు.... మూడు.... ఒక్కతే కోడలు కాబట్టి ఇరవై నాలుగ్గంటలూ చెండుకు తినొచ్చు. అవసరమైతే కాల్చుకునో, వేపుకునో తినొచ్చు."

"అ....బ్బా....! పెళ్లిలో ఇన్ని లాభాలా?!.... ఇలాగైతే అడిగేస్తాను."

"వెరీ గుడ్.... ఆ తర్వాత మిగతాది చెప్తా.... ప్రొసీడ్ అవ్వు వెంటనే:"

"నాన్నా!...." గిరీశం చెప్పినట్లు బేలగా కాకుండా కొంచెం జబర్దస్తీగా పిల్చాడు.

"ఏంట్రా కన్నా? ఏం కావాలి?" ముద్దు ముద్దుగా అడిగాడు తండ్రి గోపాలం.

"నాకర్జంటుగా పెళ్లి కావాలి." తడుముకోకుండా చెప్పేశాడు.

"దేంతో? చెర్నాకోలతోనా బడితెతోనా?.....

"నాన్నా...., అవమానిస్తున్నావ్. నాకూ ఈడొచ్చింది. లౌవ్ ఫీవర్ కూడా వస్తోంది."

"వెధవ ఇంగ్లీషు నోటికొచ్చినట్టల్లా వాగకు శుంఠ వెధవా.... పెళ్లి చెయ్యాలా? పెళ్లి?.... అయినా పెళ్లి చెయ్యమని అడిగేంతగా వచ్చాయా తెలివి తేటలు?.... మా రోజుల్లో మేం అమ్మానాన్నలు పెళ్లి చేసేదాకా సందులు గొందులు వెతుక్కునే వాళ్లమే గాని నోరు తెరిచి అడిగే వాళ్లమా?... ఔరా..... కలి కాల మహిమ?...."

"ఇంతకీ నాకు అర్జంటుగా పెళ్లి చేస్తావా? లేదా?"

"చేస్తానురా అంట్ల వెధవా..... ముందు ప్రేమించటం నేర్చుకో. ఆ తర్వాత చేస్తా. లేక పోతే.... వచ్చిన దాని ముందు నా పరువు పోతుంది."

"ప్రేమించటమా?.... ఎవర్ని?.... ఎలా?...."

"అది కూడా తెలీని వాడివి నీకు పెళ్లెందుకురా ఛప్రాసీ వెధవా?"

"ఓ.....హో.... సందులు గొందులు వెతుక్కోవటమంటే ఇదన్న మాట!... అమ్మ అర్ధాంతరంగా ఎందుకు చచ్చిందో నాకిప్పుడర్థమైంది."

"ఏడ్చావ్..... నోర్ముయ్ ఇస్తరాకుల వెధవా."

"నాన్నా!....నాకూ వయసొచ్చింది. తిట్టావంటే బావుండదు."

"ఏం చేస్తావురా పింజారీ వెధవా? ఇలాంటి వెధవ్వి కాబట్టే పదేళ్లు కష్టపడినా నీ చేత డిగ్రీ పూర్తి చేయించలేకపోయాన్రా చీపురు వెధవా."

"ఏ వెధవనైనా నీ చేతుల్తోనేగా పెంచావ్? ఇక చూడు నా తడాఖా. నీ నోటితోనే 'శభాష్' అనిపించుకుంటాను. వస్తాను.... టా,టా..... గుడ్ బై.... ఛీరియో.... సీయూ......"

"పోరా ఏ బ్రాసి వెధవా."

"ఒరేయ్ గిరీష్.... గురుభ్యోన్నమః." వస్తూనే రెండు చేతులెత్తి నమస్కరించాడు ఫ్రెండ్‌కి.

"ఏమిట్రా ఆ విచిత్ర ప్రేలాపన?" కళ్లింత చేస్తూ అడిగాడు గిరీశం.


"ప్రేలాపన కాదు గురువా. ఇక నుండి నిజంగా నువ్వే నా గురువు."

"ఇంట్లో నుండి లేచొచ్చినట్లు ఏంటా పోజు?"

"మా బాగా కనిపెట్టావ్ గురువా."

## వేణు లాజిక్

హీరో అనేవాడు ఒక్కడే ప్రతి ఫ్రేములోనూ కనిపించాలన్న రూలెక్కడా లేదు. మనం కుటుంబంలో ఉంటాం. అన్ని పనులూ మనం ఒక్కరిమే చేయాలనుకోవడం అన్ని విషయాల్లోను మనం ఒక్కరిమే తలదూర్చడం చూసేవాళ్ళకి ఎంత వెగటుగా ఉంటుంది. సినిమా కూడా అంతే! సినిమా అనేది నవరస ప్రధానమైనది అయితే ఆ నవరసాల్ని పండించడానికి నలుగురు నటులూ కావాలికదా - అంటాడు సక్సెస్‌ఫుల్ వర్థమాన హీరో వేణు.



"కారణం?.... మీ నాన్న పెళ్లి చెయ్యను పొమ్మన్నాడా?"

"అలా అనలేదుగానీ.... ముందు నన్ను పెళ్లికి అర్హుణ్నో కాదో తేల్చుకు రమ్మన్నాడు."

"ఎలా?"

"యంగ్ విడోస్ అచ్చమ్మ బుచ్చమ్మలకి లైన్లేసే వాడివి నీకు అర్థం కాలేదా గురువా? ముందు ప్రేమించటం నేర్చుకోమన్నాడు."

"ఫరవాలేదు. నువ్వు లైన్లో కొస్తున్నావ్. ఆ మనిషెవరో కూడా చెప్పాడా?" పడీ పడీ నవ్వుతూ అన్నాడు.

"అది నేనడగలేదు."

"గొప్ప అసమర్థుడివే.... ఐతే.... బుచ్చమ్మ లాంటి ఓ యంగ్ విడోని చూడమంటావా?"

"ఈ రోజుల్లో అచ్చమ్మ, బుచ్చమ్మ, పిచ్చమ్మ, పుల్లమ్మ లేంటి గురూ....?"

"ఐతే..... ఏకంగా మంజువాణి ఇంట్లో మేజువాణి ఏర్పాటు చెయ్యమంటావా? చింతామణి ఇంట్లో...."

"వాళ్ల ముని మనవరాళ్లెవరైనా వుంటే చూడు." ఉక్రోషంగా అన్నాడు.

"అలాంటి లేటెస్ట్ సెక్స్ వర్కర్స్‌ని అందుకోవాలంటే నోట్ల కట్టల్తో మెట్లు కట్టి ఎక్కాలి. నీ దగ్గరుందా?"

"నయా పైసా లేదు."

"మరి నా ఫీజు?"

"నేనిందులో సక్సెస్ సాధించి పెళ్లంటూ జరిగితే కట్నం డబ్బుల్లోంచి తీసిస్తాను. లేకపోతే మా నాన్న ఆస్తంతా నా చేతికొచ్చాకైనా ఇస్తాను."

"ఇందులో నువ్వు సక్సెస్ అవటం మీద నాక్కొంత నమ్మకముంది గాని.... ఇప్పుడిప్పుడే మీ నాన్న పోవటం మీదే నాకట్టే నమ్మకం కలగటం లేదు.... సరే.... ప్లాన్ చేసి చెప్తాను."

"ఓకే...ఓకే...."

"అర్థమయిందా? చెప్పినట్లు చెయ్యి" మర్నాడు పార్వతీశం చెవిలో కాసేపు కిచకిచలాడి జాగ్రత్తలు చెప్పాడు.

"ఓకె గురూ. ఆశీర్వదించు."

"బెస్టాఫ్ లక్.... క్షేమంగా వెళ్లి లాభంగా రా....."

గిరీశం తన గదిలో కూర్చుని కూని రాగం తీస్తుండగా వచ్చాడు పార్వతీశం.

"గురువా గిరీశం...." అంటూ.

"వాట్ హేపెండ్? సక్సెస్సా?" సంతోషంగా అడిగాడు. అదేమీ వినిపించుకోకుండా.

"అబ్బా..... ఏం దెబ్బ గురూ? బిలియన్ డాలర్లు ఖరీదు చేసే దెబ్బ. దెబ్బంటే అదీ దెబ్బని ఈ దెబ్బ తోనే తెలుసుకున్నాను." బుగ్గను చేత్తో కప్పుకుని అన్నాడు.

"కంగ్రాట్స్. కంగ్రాట్స్.... అంత మంచి దెబ్బా? కంగ్రాట్స్."

"అని చెప్పాల్సింది నాక్కాదు... నువ్వు చూపించావే షకీలా? ఆ అమ్మాయికి."

"దెబ్బ కొట్టింది నువ్వయితే.... ఆ అమ్మాయికి ఎందుకు చెప్పటం? దెబ్బ కొట్టింది నేను కాదు గురూ.... ఆ అమ్మాయే."

"నాన్‌సెన్స్..... దేంతో కొట్టింది? అలా జరగటానికి వీల్లేదే నా ప్లాన్ ప్రకారం?"

"ఎడమ కాలి బూటు..... బాటా కంపెనీ లెదర్ బూటు. ఏం స్ట్రాంగ్‌గా వుందో...."

"ఇంతకీ.... నువ్వేం చేశావ్?"

"అంతా నువ్వు చెప్పినట్లే చేశాను.... లైన్లో కొచ్చింది కదాని చివర్లో.... మీ గదిలో కెల్దామా లేక ఏదైనా హోటల్లో రూం తీసుకుందామా అనడిగాను... అంతే...."

మరుక్షణమే గిరీశం చేతిలో పార్వతీశం చెంప చెళ్లు మన్న చప్పుడు మార్మోగింది.

"యూ.... బాస్టర్డ్.... నేను చెప్పినంత వరకే చెయ్యాలిగాని నీ సొంత ప్రయోగాలు చెస్తావా?" రౌద్రం దాలుస్తూ రెచ్చిపోయాడు గిరీశం.

"పొరపాటైపోయింది గురూ.... ఈసారి జాగ్రత్త పడతాను."

"ఊఁ...." అంటూ మళ్లీ పార్వతీశం చెవిలో



కిచకిచ లాడాడు....

డల్‌గా వచ్చాడు పార్వతీశం.

"ఏంట్రా?... ఆముదం తాగినట్లా ఫేసేమిటి?" పరిశీలనగా చూస్తూ అడిగాడు గిరీశం. పార్వతీశం తలొంచుకుని దీనంగా చెప్పుకు పోతున్నాడు.

"సారీ గురూ."

"నీ ఫేస్ చూస్తేనే మళ్లీ వాయగొట్టించుకున్నావని అర్ధమౌతూంది గానీ జరిగిందేమిటో చెప్పేడువ్."

"ఈసారి నువ్వు చెప్పినంత వరకే చేశాను.... తనంతట తనే ఇంటికి తీసికెళ్లింది. తీసికెళ్లి..... వాళ్ల నాన్నా అన్నయ్యల చేత..., దెబ్బలు పైకి కనపడనీయకుండా చితక బాదించింది."

"శీల..... అలా చేసే పిల్ల కాదే?" స్వగతంలో అనుకున్నట్లు అన్నాడు.

"ఆ అమ్మాయి..... నువ్వు చెప్పిన శీల కాదు."

"మరెవరు?"

"వైదేహి.... డి.యస్.పి కూతురు"

పార్వతీశం మాటలు పూర్తి కాకముందే ఫెడీ ఫెడీ మని కొట్టాడు.

"నన్నేం చెయ్యమంటావు గురూ?.... శీలా ఎందుకో మిస్సయింది. ఊరికే తిరిగి వస్తే అసమర్ధణ్ణంటావని....."

"స్కౌండ్రల్, రాస్కెల్..... అందుకని డి.యస్.పి కూతుర్నెన్నుకుంటావా?"

"ముందు తెలీదు."

"ఎప్పుడు తెలిసింది? తన్నులు తిన్నాకా?"

"మధ్యలో తెలిసింది."

"అప్పుడెందుకు పారిపోలేదు?"

"డి.యస్.పి ఐతే నాకు సేఫ్టీగా వుంటుందను కొన్నాను."

"స్టుపిడ్.... ఇంతకీ మన అడ్రసేమైనా వాళ్లకి చెప్పి ఏడ్చావా?"

## గూటికోసం

నాకు ఇల్లూ... ఇంట్లో వాతావరణం విశాలంగా నాకు నచ్చేరీతిలో ఉండాలి. అసలు మనం కష్టపడి పని చేస్తున్నప్పుడు... ఆ కష్టాన్ని మరచిపోడానికి తగిన అనుకూలమయిన వాతావరణం కల్పించుకోవాలి. బెడ్‌రూమ్ విషయంలో... కిచెన్ విషయంలో.... బాత్రూం విషయంలో అసలు రాజీపడను. కోటి విద్యలూ కూటికోసమే కదా అంటారంతా. కాని నేనంటాను కోటివిద్యలూ.... గూటికోసమే కదా అంటుంది కాజ్మితా.

"వాళ్లడగలేదు. అడిగితే చెప్పే వాణ్నే."

"మహా గొప్ప పనిచేశావ్..... ఈ సారన్నా తెలివిగా ఏడువ్. నీకే శ్రమా లేకుండా ఏర్పాట్లన్నీ నేనే చేస్తాను... చూడూ.... ఈ పిల్ల చాలా తెలివైంది, చురుకైంది. జాగ్రత్తగా బిహేవ్ చెయ్యి. తెలిసిందా?"

"ఓ.....కె.....గురూ..."

"మళ్లీ ఫెయిల్యూరా?" ఖిన్నవదనుడై వచ్చిన పార్వతీశాన్ని అడిగాడు గిరీశం తీక్షణంగా చూస్తూ.

"ఫెయిల్యూర్ కాదు గురూ పొరపాటు."

"చెప్పిఛావు తొందరగా."

"ఎంతో వినయంగా, ఒద్దికగా, మర్యాదగా మాట్లాడిన వాళ్ల అమ్మని ఆ అమ్మాయే అను కుని..... వాటేస్కున్నాను."

దెబ్బమీద దెబ్బ..... దెబ్బ మీద దెబ్బగా ఫెడీ, ఫెడీ, ఫెడీమని కొట్టాడు.....

ఇక ఇలా లాభం లేదని ఏకంగా పార్వతీశం తండ్రిని కలిసి పెళ్లి చేసెయ్యమని సలహా ఇచ్చాడు గిరీశం. దాంతో గోపాలం ఒక నిర్ణయానికి వచ్చి ఎవరినెత్తినైనా ఇట్టే చెయ్యి పెట్టి భస్మం చెయ్యగల మంత్రాల మామయ్య కూతుర్ని చేసుకోవటమో.... లేదా లౌక్యంతో లోకుల సొమ్ము తింటూ పిల్లల్ని గున్న ఏనుగుల్లా తయారు చేసిన మేనత్త సంతాన లక్ష్మి కూతుర్ని చేసుకోవటమో నిర్ణయించుకోమని పార్వతీశానికే వదిలేశాడు.

"ఆండాళ్‌ని గానీ, గజలక్ష్మిని గానీ ఇద్దర్నీ చేసుకోను" అని తేల్చి చెప్పేశాడు పార్వతీశం.

"మరెవర్ని చేసుకుంటావో చెప్పేడువ్ చింపిరి వెధవా?" గద్దించాడు తండ్రి.


"మంజు వాణి మనమరాలు కళా రంజన్ని చేసుకుంటాను." ఖరాఖండీగా చెప్పాడు.

"నోర్ముయ్ బుదర వెధవా. నీ బుర్రలో ఉందంతా బురదేరా మురికి వెధవా. నీది బుర్ర కాదురా రొచ్చు వెధవా. ఇంత బతుకూ బతికి అలాంటి వాళ్లని తెచ్చి ఇంట్లో స్థానమిస్తానంటావా పెంట వెధవా?"

"ఊరికే తెచ్చి పెట్టను తాళి కట్టి తెస్తాను."

"ముప్పై రెండు పళ్లూ మూడు నిముషాల్లో రాలగొడతాను రౌడీ వెధవా."

"చెప్పేదోదో శాంతంగా చెప్పొచ్చుగా? అంత చిర్రు బుర్రు లాడ్డం దేనికి? వాళ్లిళ్లకి చాటు మాటుగా వెళ్లినప్పుడు లేని తప్పు పబ్లిగ్గా పెళ్లి



## అల్లు హితవు

చిరంజీవిలో ఓ గొప్ప గుణం ఉంది. ప్రతివారి దగ్గర్నుంచీ ఎంతో కొంత నేర్చుకుందామను కుంటాడు. సీనియర్ నటులు సెట్‌లో ఎలా ప్రవర్తిస్తారు. ఎలాంటి శ్రద్ధలు తీసుకుంటారు, ఎలా నటిస్తారు ఇలాంటివన్నీ గమనిస్తుంటాడు. ఒకసారి సెట్లో అల్లురామలింగయ్యగారిని చూసి మీకున్న సీనియారిటీకి ఇంకా ఎందుకు మావగారు ఈ గెటప్? అన్నాడు. అంతే... ఆహా... "ఎలాంటి సిట్యుయేషన్‌లోనూ నటనను తీసిపారేయకూడదు. నటువన్నాక, ట్రాజెడీలోనూ, కామెడీలోనూ నటుడే!" అంటూ హితవు చెప్పాడు అల్లు.

చేస్కుని ఇంటికి తెచ్చుకుంటే ఏమైంది? నువ్వూ నా వయసులో వున్నప్పుడు ఎవరికీ తెలీకుండా ఆ యింటికి చాలాసార్లు వెళ్లావని నాయనమ్మ చెప్పిందిలే." బుంగ మూతి పెట్టి అన్నాడు.

"ఇంకొక్క మాట మాట్లాడావంటే చంపేస్తాను శుంఠా. ఇంకొక్క క్షణం ఇక్కడున్నావంటే పాతి పెట్టేస్తాను. పోరా." ఆవేశంగా వూగిపోతూ టపటపా చెంపలు పగిలేలా కొట్టాడు తండ్రి....

"ఏమిట్రా? ఏమైంది? ఆ చెంపలు బలు పేమిటి?" భోరున ఏడుస్తూ వచ్చిన పార్వతీశాన్ని అడిగాడు గిరీశం.

"బలుపు కాదురా. వాపు" ఏడుస్తూనే చెప్పాడు.

"ఎవరు? ఎవరంతగా వాయగొట్టారు? కొంపదీసి..... మళ్లీ ఎవరైనా గొప్పింటి పిల్ల జోలికి వెళ్లావా?"

"బుద్ధుంటే మళ్లీ ఆ పని చేస్తానా?.... మా నాన్న పెళ్లి చేస్తానంటే ఫలానా పిల్లని చేస్కుంటానని చెప్పా."

"ఎవరా ఫలానా?" లోతుగా చూస్తూ అన్నాడు.

చెప్పాడు పార్వతీశం..... అంతే!..... ఫట్ ఫట్ ఫట్.... మని కొట్టాడు గిరీశం.

"ఏంటి గురూ? చెప్పు చెప్పు అని బలవంతం చేస్తారు. తీరా చెప్పిం తర్వాత వాయ గొడతారు?"

"సారీరా పార్వతీష్ ఆవేశం ఆపుకోలేక పోయాను. నువ్వు తీసుకున్న నిర్ణయం తప్పు. అందుకే మీ నాన్న అలా కొట్టాడు.... అసలు దాని మతలబేమిటంటే.... అలాంటి వాళ్లని అవసరానికి వాడుకో వాలే గాని పెళ్లిళ్లు చేస్కో కూడదు. వాళ్ల విషయంలో కొన్ని రూల్సున్నాయి." కూల్ డౌన వుతూ అన్నాడు.

"నాకు తెలీకడుగుతాను గురువా.... వాళ్లూ మనుషులే కదా? రక్త మాంసాలందరివీ ఒక్కటే కదా? అందరి రక్తం ఎరుపే కదా? మరి ఈ తేడా లెందుకు? ఆ రూల్సేమిటో చెప్పొచ్చుగా గురూ...."

"చంపావ్ పో.... నీకు తెలీదులే. రక్తం అందరిదీ ఒక్కటే ఐనా..... అందులో గ్రూపులుంటాయి. కాక పోతే వాళ్లకి ఇంట్లోనుండి డబ్బు కాజేసి ఇవ్వవచ్చు. బంగారం కాజేసి ఇవ్వవచ్చు. ఆస్తులన్నీ తీసికెళ్లి వాళ్లని అభిషేకించవచ్చు..... చాటు మాటు వ్యవ హారం ఎంతైనా సాగించవచ్చు. కానీ.... నలుగురిలో పబ్లిగ్గా వెంటబెట్టుకుని తిరక్కూడదు. ఫంక్షన్స్‌కీ, బంధువుల్లోకీ తీసికెళ్లకూడదు. వాళ్లవి చీకటి బ్రతుకులు. చీకట్లోనే వాడుకోవాలి. వెలుతురు లోకీ, నాలుగురిలోకీ తీసుకురాకూడదు."

"మరి..... వాళ్లని వాడుకున్న మనం?"

"మనం మగవాళ్లం కనుక దానికి 'ప్రేమ' అని అందమైన ముసుగు వేసి 'త్యాగం' అని అలంకారం చేసి సులభంగా తప్పించుకోవచ్చు. సమాజంలో ఠీవిగా, దర్జాగా, హుందాగా దూరి దర్పంగా తిరగొచ్చు.

"ఆ తరువాత మనకి పెళ్లవుతుందా?" అమాయకంగా అడిగాడు.

"దర్జాగా ఔతుంది."

"ఐతే నేనిప్పుడే వెళ్తా" చురుగ్గా వెనక్కి తిరిగాడు పార్వతీశం.

"ఎక్కడికి?"

"కళా రంజని దగ్గరికి"

"ఆగాగు. బుచ్చమ్మ లైన్లో కొచ్చేదాకా అది నాకు బుక్కయింది."

"మరిప్పుడు నన్నేం చెయ్యమంటావు గురూ?"

"అలాంటి వాళ్లదేముంది రా? మన దగ్గర డబ్బుండాలే గాని ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడే వాళ్ల ఒళ్లో వాలొచ్చు. దాంతో వాళ్ల వొళ్లు మనకప్పగించేస్తారు. అదే భార్య అనే సరికి.... చాలా కట్టు బాట్లుంటాయి. అదొక మర బొమ్మలా పడి వుండాలి. నోరెత్తిందనుకో చావబాది చితక్కొట్టి మూల మంచం మీదనో ఆస్పత్రి లోనో పారేసి మనం స్వేచ్ఛగా తిరగొచ్చు.

"పాపం..... భార్య అనేది కూడా మనిషే కదా? దాని కోరికలెవరు తీరుస్తారు?"

"వెధవ పేలుడు పేలకు - అదొక మర బొమ్మలా మనం తిప్పితే తిరగాలి. వంచితే వంగాలి.... ఈ భారతా వనిలో మగవాడికి ఏలాటి నీతి, నియమం, శీలం, కట్టు బాటు అక్కర్లేదు గాని హిందూ స్త్రీకి తప్పనిసరిగా కట్టుబాట్లు, నియమాలు, నిబంధనలు ఉన్నాయి. ఉండి తీరాలి. మగాడికి పెళ్లాం కాగానే తన మీద సర్వాధికారాలూ వాడికిచ్చేసి వాడు కొట్టినా, తిట్టినా, ఇంట్లో పెట్టి తాళం వేసినా బాధ కలిగితే తనలో తను కుళ్లి కుమిలి ఏడవాలేగాని పైకి పొంగ కూడదు. చివరికి గొడ్డలితో నరికినా, నిప్పుల్లో తగల బెట్టినా కిమ్మన కూడదు. అదీ భారతదేశపు రాజనీతి!"

"ఓహో..... పాపం.... అందుకే రోజూ చాలా మంది అబలలు ఆహుతై పోతున్నారన్నమాట."

"అన్న మాటా లేదు. తమ్ముడి మాటా లేదు. ఉన్న మాటే... అందుకే నే చెప్పేదేమంటే... మీ నాన్న తెచ్చిన కులమింటి కోతినైనా సరే పెళ్లాడు. ఆ తరువాత చూడు తమాషా."

"ఓ....కె గురూ. పెళ్లికి ఇదే పిలుపు. తప్పక వస్తావుగా?"

"ఛస్తే రాను. నీ విషయంలో మీ ఇంటికి వస్తే మీ నాన్న కనీసం కాఫీ ఇవ్వక పోగా టిఫిన్‌తో సహా హోటల్ నుంచి నన్నే తెప్పించి పెట్టమన్నాడు.... ఇక నువ్వు పద."

"నన్నూ, నా తప్పుల్నీ ఏకంగా క్షమించెయ్ నాన్నా. నీ యిష్ట ప్రకారమే మంత్రాల మామయ్య కూతుర్ని చేసినా తంత్రాల అత్తయ్య కూతుర్ని చేసినా లేక ఇద్దర్నీ చేసినా బుద్ధిగా తాళి కట్టేస్తాను."


"ఊఁ..... లైన్లోకొచ్చావన్న మాట.... ఆ ఇద్దరూ వద్దు. నా చిన్న నాటి స్నేహితుడి కూతుర్ని చేస్తాను." పార్వతీశానికి.... సారీ.... పార్వతీష్‌కి పెళ్లన పెళ్లైంది. ఇది జరిగిన మూడో రోజున.....

"గురువా గిరిశమో!.... గురూ!.... మోసం గురూ...." శోకాలు పెడుతూ వచ్చి పడ్డాడు.

"ఏమైందిరా పార్వతీశం? ఈ అర్ధరాత్రి శవం లేచినట్లు ఆ శోకాలేంటి? ఈ రాకేమిటి? లెక్క ప్రకారం ఈరాత్రి నీకు శోభన రాత్రి కదా? ఏంటి కథ?" కంగారుగా అడిగాడు గిరీశం.

"ఔను గురూ....." పొగిలి పొగిలి ఏడుస్తూ చెప్పాడు.

"కొంప దీసి..... మీ నాన్నగాని పోయాడా?... అబ్బ.... అదే నిజమైతే నా ఫీజు రెట్టింపై త్వరలో చేతికొస్తుంది. త్వరగా చెప్పరా పార్వతీశం...." ఆనందం ముప్పిరి గొంటూండగా, అడిగాడు.



"లేదురా గిరీశమో...."

"నాకు తెలుసురా. మీ నాన్న అంత తొందరగా ఛస్తాడా?.... లేకపోతే..... నవ్వు తాళి కట్టీ కట్టక ముందే..... కాలు పెట్టీ పెట్టక ముందే మీ అత్తగానీ, మామగానీ హరీ మన్నారా?"

"అదే కాదు గురువా గిరీశమా...."

"మరైతే ఏంటో తొందరగా చెప్పి తగలడరా అప్రాచ్యపు వెధవా. సస్పెన్స్‌తో చంపకు ఏ బ్రాస్టి వెధవన్నర వెధవా." గోపాలం గారి భాషనందుకున్నాడు గిరీశం.

"నేను తగలడటం లేదు. ఏడుస్తున్నాను గిరీశమో...."

"సరే.... విషయం చెప్పి ఆ తరువాత ఏడుపు ఏడుపు గొట్టు వెధవా."

"నేను పెళ్లి చేసుకుంది ఎవరంటే..... పెళ్లి చూపులు లేకుండా చేసుకోవటానికి ఈ పొరపాటు జరిగింది గురూ." మళ్లీ భోరుమన్నాడు.

"తొందరగా చెప్తావా?.... చెప్పు తీసి ఉతక మంటావా?" ఎడం కాలి చెప్పు తీశాడు గిరీశం.

"ఆ అమ్మాయి.... వాళ్ల నాన్న, అన్నయ్యల చేత చితక తన్నించిందే?.... డి.యస్.పి. కూతురు వైదేహి వా...." చిన్న పిల్లాడిలా రాగమందుకున్నాడు నాన్‌స్టాప్‌గా చెప్పుకుపోతూ.

"అరె!..... కథలా అడ్డం తిరిగిందా?.... ఐనా ఫరవాలేదు. తాళి కట్టేశావు గనక డి.యస్.పి కూతురైన వాడి బాబు కూతురైనా చచ్చినట్లు పడి వుండవలసిందే. ఇంతకీ శోభనం?"

"చిక్కంతా అక్కడే వచ్చింది గురూ వా...."

"వివరంగా చెప్పేడువు సన్నాసి వెధవా."

"తాళైతే కట్టేశాను గానీ.... శోభనం అనేసరికి..... తెల్లారేసరికి నేను నేనుగా మిగుల్తానా అని భయమేసి.....వా....."

"ఏం చేశావ్?"

"....ఆమె నడక, వినయం, విధేయత, కట్టు బొట్టు, ప్రసన్న వదనం.... అన్నీ బాగా నచ్చి గౌరవభావం, అభిమానం, ప్రేమ పెల్లుబికి.... చిన్నగా.... గదిలోకి నువ్వొస్తావా అన్నాను అంతే."

"నీ భార్యనేగా?"

"కాదు....వా..."

"మరి?" విభ్రమాశ్చర్యాలతో చూస్తూ అడిగాడు.

"....మా అత్తగారిని.... వాళ్లు మా విడాకుల కోసం అప్లై చెయ్యటానికి రేపు నీ దగ్గరికే రాబోతు న్నారు. వా.... ఈ కేసు టేకప్ చేస్తావా? వా...."

"ఒరేయ్ పార్వతీశం.... టేకప్పూ లేదు, సెటప్పూ లేదు. నాకు పది కాలాల పాటు బ్రతకాలని వుంది. నన్ను బ్రతకనీ బాబూ. నువ్వేళ్లి నన్ను బ్రతికించు నాయనా. వా....." ఈసారి గిరీశం ఘోరంగా, దారుణంగా, హృదయ విదారకంగా ఏడుపందుకున్నాడు.... ❋

# సెక్సు లేని జీవితం చప్పగా ఉంటుంది!

**- అశోక్ కుమార్**



అశోక్‌కుమార్ పేరు చెప్పగానే 'అభినందన' చిత్రం గుర్తుకొస్తుంది. అశోక్‌కుమార్ పేరు చెప్పగానే ప్రపంచ ప్రఖ్యాత కెమెరామెన్ గుర్తుకొస్తాడు. 'జీన్స్' చిత్రంలో అశోక్‌కుమార్ పనితనం చూసి ప్రపంచదేశాల్లో ఛాయాగ్రహ నిపుణులందరూ ముక్కుమీద వేలేసుకున్నారు. తను చేస్తున్న పనిపట్ల కాన్‌సంట్రేషన్ తను చెప్పదలచుకున్న విషయం కన్‌ఫ్యూజన్ లేకుండా చెప్పడం అశోక్‌కుమార్‌లో ప్రత్యేకతలు. తనకంటూ నిర్దిష్టమైన ఔన్నత్యం గల అశోక్‌కుమార్‌తో 'ప్రియదత్త' జరిపిన మినీ ఇంటర్వ్యూ చదవండి.

**ఛాయాగ్రహణం పట్ల మీకు ఆసక్తి ఎలా కలిగింది?**

ఆ రోజుల్లో ఫోటోలు తీసేవాళ్ళని అందరూ విచిత్రంగా చూసేవాళ్ళు.. నన్ను అలాగే గొప్పగా చూడాలని స్కూలుకెళ్ళమని ఇచ్చిన డబ్బుల్తో ముందుగా ఓ డబ్బా కెమెరా కొన్నాను. అప్పట్లో కెమెరా యాభై రూపాయలులోపే... ఆ కెమెరాతో నేను విన్యాసాలు చేయడం ప్రారంభించాను. నేను తీసిన ఫోటోలను అందరూ మెచ్చుకొనేవారు. అలా ఉత్సాహం వల్ల టాలెంట్‌ని డెవలప్ చేసుకున్నాను.

**మీ మొదటి చిత్రం?**

మలయాళ చిత్రం రాముకలియత్ "కొండగాలి" అవార్డు గెలుచుకుంది.

**తమిళంలో ఎన్ని చిత్రాలు చేశారు?**

తమిళం అని కాదు గాని మొత్తం యాభై పైచిలుకు చిత్రాలు చేసి ఉంటాను.

**అందులో మీకు పేరు తెచ్చిన చిత్రాలు?**

అన్ని చిత్రాల్లోనూ అశోక్‌కుమార్ ముద్ర ఉంటుంది. గొప్ప కాదు గాని అశోక్‌కుమార్ ఫోటోగ్రఫీకోసం ఒకసారి చూడొచ్చు అని ప్రేక్షకులనుకోవడం విన్నాను.

**మీకు అసిస్టెంట్స్‌గా ఆడవాళ్ళనే ఎందుకు పెట్టుకుంటారు?**

మగవాళ్ళకు అవకాశాలు చాలా వుంటాయి. ఆడవాళ్ళను కూడా మంచి కెమెరామెన్‌లుగా తీర్చిదిద్దాలన్నది నా ఆలోచన. సుహాసిని, కృష్ణప్రియలు ఆ కోవకి చెందినవారే!

**మీ సినిమాల్లో 'సెక్సు'కి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. 'కామ' చిత్రం తీయడంలో మీ ఉద్దేశ్యం?**

అదేవిటి? నేను టెక్నీషియన్‌ని. ఎలాంటి సినిమానైనా హేండిల్ చేస్తాను. ఆమాటకొస్తే 'సెక్సు' జీవితంలో ఓ ప్రధానభాగం. సెక్సులేని జీవితం ఎంత చప్పగా ఉంటుంది? ప్రతి ప్రేక్షకుడు సెక్సుని గురించి తెలుసుకుందామనుకుంటాడు. కాని బయటపడడు. అదేదో చేయకూడని పనిలా నీతులు వల్లిస్తాడు. నిజానికి సెక్స్‌ని పబ్లిగ్గా ఒప్పుకోగలిగితే... ఇన్ని దొంగచాటు బూతు చిత్రాలు విశృంఖలంగా రాజ్యం చేసేవి కావు.

**"సాయిచరిత" ఎందువలన ఫెయిల య్యింది?**

అది ఫెయిలయిందని మీరంటున్నారు. బ్రహ్మాండమయిన ఆదరణ లభించింది. ప్రస్తుతం ఓవర్‌సీస్ మార్కెట్ చేసుకుంటోంది. అయితే లోగడ ఓ చిత్రం రావడం వలన ఈ చిత్రం పట్ల అంత క్యూరియాసిటీ ఉండకపోవచ్చు!

**"జీన్స్" కెమెరా విషయంలో ప్రపంచం అంతా మీ పనితనం చూసి ఆశ్చర్య పోయింది. ఎలా అంతటి అద్భుతమయిన ఫలితాలు సాధించగలిగేరు?**

వెరీ సింపుల్.... సాధించాలన్న పట్టుదలే!

**ప్రస్తుతం మీరు?**

"రిలాక్సింగ్‌గా ఉన్నాను. టీ.వి. సీరియల్ ప్లాన్ చేస్తున్నా. ఆ పని మీద వచ్చా. బాయ్" అంటూ హుందాగా ఇంటర్వ్యూ ముగించాడు.

ముఖ్యంగా వయసులో చిన్నవాడైనా అద్భుతమయిన టెక్నీషియన్ అశోక్‌కుమార్ మనసుంటే మార్గం అదే ఉంటుంది! ❋